ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5



శ్రీకాకుళం

జిల్లా వార్తలు

గురువారం 7 ఆగస్టు 2025



మెళియాపుట్టి: గొడ్డ వద్ద వాడిపోతున్న వరి నారు

చినుకు జాడేదీ?

- రెండు వారాలుగా ముఖంచాటేసిన వానలు
- కాలువల ద్వారా చుక్కనీరు రాని వైనం
- ఎండిపోతున్న వరి ఎదలు, ఉభాలు
- కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికీ దమ్ములు కాలేదు
- మాడుతున్న నారు.. ఆందోళనలో రైతులు



● ఈ కౌలు రైతు పేరు యాళ్ల తవిటయ్య. నరసన్నపేట మండలం మాకివలస గ్రామానికి చెందిన తవిటయ్య 4 ఎకరాలు కౌలుకు తీసుకొని వరి సాగు చేస్తున్నాడు. ఎకరాకు రూ.15వేలు కౌలు చెల్లించాడు. మరో రూ.12వేలు పెట్టుబడితో దమ్ములు పెట్టి ఉభాలు చేశాడు. గత రెండు వారాలుగా వరుణుడు ముఖం చాటేశాడు. దీనికి తోడు కాలువల్లో చుక్కనీరు రాకపోవడంతో వరి నాట్లు ఎండిపోతున్నాయి. ఎప్పుడు వర్షం పడుతుందా? అని మేఘం వైపు చూస్తూ ఇలా పొలంలోనే తవిటయ్య దీనంగా కూర్చున్నాడు.



● ఈ రైతు పేరు పీస రామారావు. నరసన్నపేట మండలం కిళ్లాం గ్రామానికి చెందిన ఈయన మూడు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని వరి ఎదలు వేశాడు. మొదట్లో వర్షాలు అడపదడపా పడడంతో చేలు బాగుండేవి. గత రెండు వారాలుగా వర్షాలు లేక, ఎండలకు ఎదలు ఎండిపోతున్నాయి. వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టి సాగు చేస్తున్న వరి ఎదలు ఎండిపోతుండడంతో ఆందోళన చెందుతున్నాడు. వర్షాల కోసం ఆకాశం వైపు చూస్తున్నాడు.

ఇప్పటికే పచ్చని పంటలతో ఖరీఫ్ కళకళలాడాల్సి ఉంది. ఎరువులు వేసుకోవడం, కలుపు నివారణ మందులు పిచికారీ చేయడంలో జిల్లా రైతులు బిజీగా ఉండాల్సింది. కానీ, వర్షాలు లేక.. కాలువల ద్వారా సాగునీరు అందక ఆగస్టు మొదటి వారం గడుస్తున్నా ఇంకా చాలా చోట్ల నాట్లు పడలేదు. ప్రతిరోజూ మేఘాలు ఊరిస్తున్నాయే తప్ప వర్షాలు కురవడం లేదు. ఉభాలు సీజన్ కూడా దాటి పోవడంతో రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో అడపదడపా పడిన వానలకు రైతులు ఎదలు, నాట్లు వేశారు. ఇప్పుడు వర్షాలు ముఖం చాటేయడంతో అవి ఎండిపోతున్నాయి.

నరసన్నపేట/ కోటబొమ్మాళి/ మెళియాపుట్టి/ కొత్తూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి)

ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభం నుంచే రైతులను సాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. ఒకపక్క వర్షాలు లేక.. మరొపక్క కాలువల్లో సాగునీరు రాక.. ఇంకొకపక్క వేసవిని తలపించేలా ఎండలతో వరి నారు, ఎదలు, నాట్లు ఎండిపోతున్నాయి. ఇంజన్లు పెట్టి నీరు తోడుదామన్న చెరువుల్లో చుక్క నీరు కూడాలేదు. దీంతో జిల్లాలోని అనేక మండలాల్లో కరువు ఛాయలు కమ్ముకుంటున్నాయి.

● నరసన్నపేట మండలంలోని జమ్ము, తామరాపల్లి పంచాయతీల పక్కనుంచే ఎన్బీసీ కాలువ వెళ్లినా... సాగునీరు ఎడమ వైపునకు వెళ్లడం లేదు. దీనివల్ల ఆ పంచాయతీల్లో నీరందక ఎదలు ఎండిపోతున్నాయి. వంశధార నది చెంతన ఉన్న గోపాలపెంట, మాకివలస, కిళ్లాం, మబుగాం, పోతయ్యవలస, మడపాం, లుకలాం, కామేశ్వరిపేట తదితర గ్రామాల్లో సుమారు ఆరు వేల ఎకరాల్లో వరి పొలాలు ఎండిపోతున్నాయి. 11 ఆర్ కిళ్లాం కాలువలో చుక్క నీరు రాకపోవడంతో మడపాం, దేవాది, కిళ్లాం రైతులు ఆందోళన చెందుతున్నారు. జమ్ము, టెక్కలిపాడు, తామరాపల్లి, గడ్డెయ్యపేట, శివరాంపురం, పొన్నానపేట గ్రామాలకు సాగునీరు అందించే టెక్కలిపాడు ఎత్తిపోథల పథకం నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా సాగునీరు అందడం లేదు. ఎత్తిపోథల పథకం నిర్వహణకు ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని, 11 ఆర్ కిళ్లాం కాలువ ద్వారా నీరు విడిచిపెట్టాలని, నదితీర ప్రాంతాలకు ఓపెన్ హెడ్ చానల్స్ అనుసంధానం చేసి సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై వంశధార నరసన్నపేట డివిజన్ ఈఈ మురళీమోహన్ మాట్లాడుతూ.. 'శివారు ప్రాంతాల కోసం వారం కిందట నీరు విడిచిపెట్టాం. సోమవారం నుంచి ఎన్బీసీ కాలువ ద్వారా సాగునీరు అందిస్తాం.' అని తెలిపారు.



కొత్తూరులో వాడిపోతున్న వరి ఎద



కోటబొమ్మాళి: దుర్గంపేటలో నీరు లేక ఎండిపోతున్న వరి

● కోటబొమ్మాళి మండలంలోని 38 గ్రామ పంచాయతీల పరిధిలో సుమారు 10వేల హెక్టార్ల పంట భూములు ఉన్నాయి. ఇందులో వంశధార కాలువల కింద ఉన్న ఆరు వేల హెక్టార్లలో రైతులు వరి సాగు చేస్తున్నారు. మరో రెండు వేల హెక్టార్లలో ఎత్తిపోతల పథకం, వర్షాధారం ద్వారా పంటలు పండిస్తున్నారు. ఈ ఏడాది రైతులు నానా ఇబ్బందులు పడి వరినాట్లు వేశారు. అయితే, రెండు నెలలుగా వర్షాలు కురవకపోవడంతో నీరు లేక వరినాట్లతో పాటు వేరుశెనగ, కూరగాయాల పంటలు ఎండిపోతున్నాయి. ఆయిల్ ఇంజన్లు పెట్టి నీరు (మిగతా 6వ పేజీలో..)



మహిళలకు శుభవార్త

- ఆర్టీసీ బస్సు ఉచిత ప్రయాణానికి మంత్రివర్గం ఆమోదం
- ఈ నెల 15 నుంచే 'స్త్రీ శక్తి' ప్రారంభం ● జిల్లాలో 250 బస్సుల కేటాయింపు

శ్రీకాకుళం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఊహించిన విధంగానే కూటమి ప్రభుత్వం మహిళలకు శుభవార్త చెప్పింది. స్త్రీ శక్తి పథకం ద్వారా ఎటువంటి ఆంక్షలు లేకుండా మహిళలు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం చేసేందుకు రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో బుధవారం మంత్రి వర్గం నిర్ణయం తీసుకుంది. దీనిపై మహిళలు, విద్యార్థినుల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

నాలుగు డిపోల్లో 310 బస్సులు..

జిల్లాలో శ్రీకాకుళం-1, శ్రీకాకుళం-2, టెక్కలి, పలాస ఆర్టీసీ డిపోలు ఉన్నాయి. ఈ డిపోల పరిధిలో 310 బస్సులు ఉన్నాయి. ఇందులో 250 ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణం చేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. త్వరలో మరో యాభై విద్యుత్ బస్సులు జిల్లాకు రానున్నాయి. జిల్లాలో అత్యధికంగా ఇచ్ఛాపురం నుంచి విశాఖ వరకు ఆర్టీసీ సర్వీసులు ఉన్నాయి. ప్రయాణికులు కూడా అధికంగా ఉంటారు. ప్రతి వంద మంది ప్రయాణికుల్లో 30 శాతం మంది మహిళలే ఉంటున్నారు. వీరంతా సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. ఎక్కడ నుంచి ఎక్కడి వరకైనా చార్జీ లేకుండా వెళ్లవచ్చు. ఆధార్, ఓటర్ ఐడీ కార్డు వంటి ప్రభుత్వ గుర్తింపు కార్డు చూపిస్తే సరిపోతుంది. విద్యార్థినులకు ఇక బస్ పాస్‌ల అవసరం ఉండదు. బస్సులో ప్రయాణించే మహిళలకు 'జీరో' టిక్కెట్ ఇస్తారు. ఇందుకుగాను ఇప్పటికే ఆర్టీసీ సిబ్బందికి అధికారులు శిక్షణ ఇచ్చారు. బస్సుల కండీషన్‌ను కూడా మార్పుచేశారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌ల్లో సౌకర్యాలు కూడా మెరుగుపరుస్తున్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఆక్యుపెన్సీ పెరగనుండటంతో అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

విషాదం



దుర్యోధన(ఫైల్)



జశ్వంత్ (ఫైల్)



రాజేష్ (ఫైల్)

- సముద్రంలో గల్లంతైన ముగ్గురు యువకులు మృతి
- భావనపాడు తీరానికి చేరిన మృతదేహాలు

టెక్కలి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): భావనపాడు తీరంలో సముద్ర స్నానం చేస్తూ మంగళవారం సాయంత్రం గల్లంతైన ముగ్గురు యువకులు మృతి చెందారు. వారి మృతదేహాలు బుధవారం లభ్యమయ్యాయి. వజ్రపుకొత్తూరు మండలం పాతటెక్కలి పంచాయతీ మడేవానిపేటకు చెందిన దున్న దుర్యోధన (18), పూడిజగన్నాథపురం గ్రామానికి చెందిన తిమ్మల జశ్వంత్ (18), పలాస మండల టెక్కలిపట్నంకు చెందిన రాయల రాజేష్(19) సముద్రంలో గల్లంతైన విషయం తెలిసిందే. వారు ఏ ప్రాంతంలో స్నానానికి దిగారో అక్కడికి అతి దగ్గరగా మృతదేహాలు కొట్టుకువచ్చాయి. జశ్వంత్, రాజేష్ మృతదేహాలు బుధవారం ఉదయానికే లభ్యమైనట్లు మెరైన్ సీఐ డి.రాము తెలిపారు. మధ్యాహ్నానికి జెట్టీ సమీపంలో గోడ వద్ద దుర్యోధన మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, సంతబొమ్మాళి తహసీల్దార్ హేమసుందరరావు, రూరల్ సీఐ శ్రీనివాసరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. నౌపడా ఎస్ఐ నారాయణస్వామి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

మిన్నంటిన రోదనలు..

అందివచ్చిన కొడుకులు అనంత లోకాలకు వెళ్లిపోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. భావనపాడు తీరంతో పాటు టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రి వద్ద బిడ్డల మృతదేహాలను చూసి దుర్యోధన తల్లి సీతమ్మ, తండ్రి మాధవరావు, జశ్వంత్ తల్లి సుధ, తండ్రి వల్లభరావు, రాజేష్ తల్లి జ్యోతి, కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితుల రోదనలు మిన్నంటాయి. వారిని ఓదార్చడం ఎవరితరం కాలేదు. ముగ్గురు యువకుల మృతితో వారి స్వగ్రామాల్లో విషాదఛాయలు అలముకున్నాయి.

ప్రాణాలు తీస్తున్న సరదా



శివసాగర్ తీరంలో పర్యాటకులు

- ఈత కోసం సముద్రానికి వెళ్తున్న యువత
- జాగ్రత్తలు పాటించక పోవడంతో గల్లంతై మృత్యువాత
- బీచ్‌ల వద్ద కానరాని ప్రమాద హెచ్చరిక బోర్డులు

వజ్రపుకొత్తూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఈత సరదా ప్రాణాలు తీస్తుంది. ఎండ నుంచి ఉపశమనం పొందడానికో.. లేక సరదాగా స్నానం చేయడానికో సముద్రానికి వెళ్తున్న వారు కనీస జాగ్రత్తలు పాటించడం లేదు. దీనివల్ల కెరటాలకు గల్లంతై మృత్యువాత పడుతున్నారు. వీరిలో అధికంగా యువతే ఉండడం బాధాకరం. మంగళవారం, భావనపాడు తీరంలో సముద్ర స్నానం చేస్తుండగా అలల ఉధృతికి గల్లంతై ముగ్గురు డిప్లొమా విద్యార్థులు మృతి (మిగతా 6వ పేజీలో..)

చేనేతలకు చంద్రన్న కానుక

- కార్మికుల ఇళ్లలో కొత్త కాంతులు
- ఉచిత విద్యుత్ ప్రకటనతో ఆనందం
- మేలు చేసే నిర్ణయమని అభిప్రాయం
- నేడు జాతీయ చేనేత దినోత్సవం

6లో

సంస్కృతం.. ప్రాచీన భాష

- ఇతర దేశాల్లోనూ ఈ పదాల మూలాలు
- నేటి నుంచి సంస్కృత భాషా వారోత్సవాలు

6లో

బాధ్యులైన టీచర్లపై చర్యలు తప్పవు

- ఆశ్రమ పాఠశాలను పరిశీలించిన అధికారులు

6లో

ప్రశ్నిస్తే చితకబాదుతారా?

- అన్యాయంగా కేసులు పెట్టించారు
- పోలీసుస్టేషన్ ఎదుట ప్రజల నిరసన
- తాము ఎవరినీ కొట్టలేదన్న ఎస్ఐ

8లో

పూండి రోడ్డుకు మోక్షం

- విస్తరణకు రూ.100 కోట్లు మంజూరు
- 58 కిలోమీటర్ల పొడవున రెండు లైన్లతో నిర్మాణం
- ఐదు మండలాల ప్రజలకు ప్రయోజనం



బెండిగేటు- పూండి రోడ్డు

వజ్రపుకొత్తూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఉద్దానం వాసుల చిరకాల కోరిక తీరనుంది. పూండి రోడ్డు నిర్మాణానికి రూ.100 కోట్లు మంజూరయ్యాయి. ఐదు మండలాలను కలుపుతూ సుమారు 58 కిలో మీటర్ల పొడవున రెండు లైన్ల రోడ్డు నిర్మించనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ రోడ్డును నిర్మించనున్నాయి.

ఇదీ పరిస్థితి..

వజ్రపుకొత్తూరు మండలం వెంకటాపురం నుంచి బెండిగేటు మీదుగా పూండి, సంతబొమ్మాళి మండలం నౌపాడ నుంచి పోలాకి మండలం డోలా వరకు సుమారు 58 కిలో మీటర్ల పొడవున బ్రిటీష్ కాలంలో రోడ్డును వేశారు. అప్పట్లో అది మట్టి రోడ్డు. తరువాత వచ్చిన ప్రభుత్వాలు తారు రోడ్డుగా మార్చాయి. జనాభా, వాహనాల సంఖ్య గణనీయంగా పెరగడంతో పూండి రోడ్డు రద్దీగా మారింది. పైగా సింగిల్ రోడ్డు కావడంతో నిత్యం ప్రమాదాలు జరిగేవి. చాలామంది మృత్యువాత పడగా, మరికొంతమంది తీవ్రగాయాలతో మంచంపట్టారు. పూండి రోడ్డును విస్తరించాలని, రెండులైన్లగా మార్చాలని ఈ ప్రాంతీయుల నుంచి డిమాండ్ పెరిగింది. దీనికోసం మండల సమావేశాల్లో తీర్మానాలు చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వం రోడ్డు నిర్మాణం కోసం హడావిడి చేసినా పనులు మాత్రం చేపట్టలేకపోయింది. ఈ క్రమంలో పూండి రోడ్డు విస్తరణ విషయంపై కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే గౌతు శిరీష ఢిల్లీ వెళ్లి కేంద్రం మంత్రులను కలిశారు. దీంతో రోడ్డు నిర్మాణానికి కేంద్ర (మిగతా 6వ పేజీలో..)

త్వరలోనే పనులు ప్రారంభిస్తాం

వెంకటాపురం-పూండి మీదుగా డోలా వరకు సుమారు 58 కిలో మీటర్లు పొడవున రహదారి నిర్మాణానికి కేంద్రం జీవో విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసిన వెంటనే పనులు ప్రారంభిస్తాం. ఒకటి రెండు నెలల్లో విస్తరణ పనులు ప్రారంభించే అవకాశం ఉంది. అన్ని రకాల అడ్డంకులు తొలగిపోయాయి. రోడ్డు నిర్మాణం పూర్తయితే ఐదు మండలాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది.

-జగదీష్, జేఈ, ఆర్అండ్‌బీ

పునరావాస అంశాలపై దృష్టి సారించండి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మూలపేట పోర్టు నిర్వాసితుల పునరావాస అంశాలపై దృష్టి సారించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పునరావాస గ్రామాల నిర్మాణం, స్థలాల కేటాయింపు, మౌలిక వసతుల కల్పన, గృహ నిర్మాణాలు, తాగునీటి సరఫరా, రహదారుల అనుసంధానం, పునరావాస ప్రక్రియ, విశేష గ్రామాల పరిధిలోని ఖాళీ స్థలాల వినియోగంపై అధికారులతో చర్చించి, పలు సూచనలు చేశారు. పోర్టు రహదారికి సంబంధించిన న్యాయపరమైన అంశాలు, రైల్వే మార్గంలో చేయాల్సిన సాంకేతిక మార్పులపై సమీక్షించారు. ఇతర శాఖల సమన్వ యంతో జరుగుతున్న పనుల వివరాలను అధికారులు కమిటీకి సమర్పిం చారు. ఈ సమావేశంలో డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో డీఎస్సీ ఫలితాలు

- సన్నాహాలు చేస్తున్న పాఠశాల విద్యాశాఖ
- జిల్లాలో భర్తీకానున్న 543 ఉపాధ్యాయ పోస్టులు




ఎచ్చెర్ల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ ఫలితాలను విడుదల చేసేందుకు పాఠశాల విద్యాశాఖ యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటుంది. మరికొద్ది రోజుల్లో ఫలితాలు విడుదల చేసి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు సన్నాహాలు చేస్తుంది. జిల్లాకు సంబంధించి 543 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ కానున్నాయి. డీఎస్సీ పరీక్షలు ఈ ఏడాది జూన్ 6 నుంచి జూలై 2వ తేదీ వరకు జరిగాయి. జిల్లాలోని ఐదు కేంద్రాలతో పాటు ఒడిశాలోని ఓ కేంద్రంలో జరిగిన ఈ పరీక్షలను 35వేల మంది అభ్యర్థులు రాశారు. జిల్లాకు చెందిన పలువురు అభ్యర్థులు ఉపాధ్యాయ పోస్టులు ఎక్కువగా ఉన్న తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, (మిగతా 8వ పేజీలో..)


బొంతలకోడూరులో నేత పనిలో ఆట్ల సాంబశివ

చేనేతలకు చంద్రన్న కానుక

● కార్మికుల ఇళ్లలో కొత్త కాంతులు ● ఉచిత విద్యుత్ ప్రకటనతో ఆనందం
● మేలు చేసే నిర్ణయమని అభిప్రాయం ● నేడు జాతీయ చేనేత దినోత్సవం





ఎచ్చెర్ల, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): చేనేతకు కూటమి ప్రభుత్వం బాసటగా నిలిచింది. జాతీయ చేనేత దినోత్సవానికి ముందే నేత కార్మికులను ఆదుకునేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. చేనేత మగ్గాలకు 200 యూనిట్లు, మర మగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను సరఫరా చేసేందుకు నిర్ణయించింది. దీంతో చేనేత కార్మికులు ఆనందంలో ఉన్నారు. ఎచ్చెర్ల మండలం బొంతలకోడూరు గ్రామం చేనేతకు పెట్టింది పేరు. ఈ గ్రామంలో ఒకప్పుడు సుమారు 200 కుటుంబాలు దీనిపైనే ఆధారపడి జీవనం సాగించేవి. ఒకప్పుడు చేనేతతో దేదీప్యమానంగా వెలుగొందిన ఈ గ్రామంలో నేడు సుమారు 70 కుటుంబాలు మాత్రమే ఈ వృత్తిలో కొనసాగుతున్నారు. చేనేతను నమ్ముకోవడం వల్ల జీవనం కష్టసాధ్యం కావడంతో బతుకు జీవుడా అంటూ చాలా మంది ఇప్పటికే వలసబాట పట్టారు. చేనేత కుటుంబాలకు చెందిన యువకులు ఆ వృత్తిలో ఉండేందు కు ఇష్టపడడం లేదు. ఈ కారణంతో బంగారం షాపులు, కిరాణా దుకాణాలు, లాడ్జిల్లో పనులు చేస్తూ బతుకు వెళ్లదీస్తున్నారు.

చిన్నప్పటి నుంచి ఇదే వృత్తిలోనే...

బాల్యం నుంచి ఇదే వృత్తిలో కొనసాగుతున్నాను. ఇప్పటితరం ఈ వృత్తిలో కొనసాగేందుకు ఇష్టపడడం లేదు. గిట్టుబాటు లేకపోవడంతో ఇబ్బందిగానే ఉంది. ఉచిత విద్యుత్ ప్రకటనతో ఊతం ఇచ్చినట్టయ్యింది.

-ఆట్ల సాంబశివ, చేనేత కార్మికుడు, బొంతలకోడూరు


చేనేత మగ్గంపై నూలు వడుకుతున్న చిన్నమ్మడు


పెద్దతామరాపల్లిలో మగ్గం పనిచేస్తున్న కార్మికురాలు

90 చేనేత కుటుంబాలకు ఆసరా..

జి.సిగడాం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలంలో 90 చేనేత కుటుంబాలు ఉన్నాయి. ప్రతి కుటుంబానికి ఒక చేనేత మగ్గం ఉంది. దీని ఆధారంగానే జీవిస్తున్నారు. వీరికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేనేత మగ్గాలకు 200 యూనిట్లు, మర మగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను వర్తింపుతో ఈ కుటుంబాలపై కొంత ఆర్థిక భారం తగ్గినట్లు అవుతుంది. దేవరవలసలో 80 చేనేత కుటుంబాలు ఉండగా... సుమారు 270 మంది ఈ వృత్తిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. గెడ్డకంచరాంలో 10 నేతన్న కుటుంబాలకు గాను సుమారు 30 మంది చేనేతపైనే ఆధారపడి ముందుకు సాగుతున్నారు. రెండు గ్రామాలలో కలిపి 90 కుటుంబాలకు ఉచిత విద్యుత్ వల్ల ప్రయోజనం కలగనుంది.

నందిగాం మండలంలో..

నందిగాం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): నందిగాం మండలం పెద్దతామరాపల్లిలో సుమారు 250 చేనేత కుటుంబాలు ఉన్నాయి. వీరిలో సుమారు 45 కుటుంబాల వారు మగ్గం పనులు చేస్తున్నారు. గ్రామంలో స్వదేశీ యారన్ చేనేత పారిశ్రామికుల సహకార ఉత్పత్తి విక్రయ కేంద్రం ఉంది. దీనిలో 200మందికి ఓటు హక్కు ఉంది. ఈ సంఘం పరిధిలో పెద్దతామరాపల్లితో పాటు నందిగాం, నర్సిపురం, టెక్కలి మండలం కాంట్రగడ గ్రామాలకు చెందిన కార్మికులు సభ్యులుగా ఉన్నారు. కానీ కేవలం తామరాపల్లి, కాంట్రగడలోని కార్మికులే మగ్గం పనులు చేస్తున్నారు. ముఖ్యమంత్రి ప్రకటనతో తమకు ఊరట కలుగుతోందని కార్మికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సీఎం ప్రకటన ఆనందాన్ని నింపింది..



ముఖ్యమంత్రి చంద్రబాబు చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ ఇస్తామని చేసిన ప్రకటన మా కార్మికుల్లో ఆనందం నింపింది. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని మగ్గం పనిచేసే వారికి 200 యూనిట్ల మేర ఉచిత విద్యుత్ అందిస్తామని ప్రకటించడం శుభపరిణామం.

-యర్ర రామారావు, చేనేత కార్మికుడు, పెద్దతామరాపల్లి

పాతపట్నం నియోజకవర్గంలో..

పాతపట్నం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పాతపట్నం మండల కేంద్రంతో పాటు కొరసవాడ, కాగువాడ, సీది గ్రామాలు, మెళియాపుట్టి మండలంలోని జాడుపల్లి, చాపరలో చేనేత కుటుంబాలు ఉన్నాయి. హిరమండలం మండలంలో శుభలయ కాలనీ, తురకపేట, కొత్తూరు మండలంలోని శిరుసువాడ, కౌసల్యాపురం, పెనుగుటివాడ, వీరనారాయణపురం గ్రామాలలో అధిక సంఖ్యలో చేనేత కార్మికుల ఉన్నారు. సరైన ప్రోత్సాహకాలు లేక దిగాలు పడుతున్న తరుణంలో చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉచిత విద్యుత్ వారిలో సంతోషాన్ని నింపుతోంది.

ఉచిత విద్యుత్ అవసరం..



ఉచిత విద్యుత్ మంచి ప్రోత్సాహకమే. మగ్గం ఉన్న చేనేత కార్మికులకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది.

-కాశిన ఆదినారాయణ, వస్త్రపురి కాలనీ, కాగువాడ

తప్పకుండా అమలుచేయాలి..



ప్రభుత్వం నామమాత్రంగా ప్రకటించి విడిచి పెట్టకుండా ఉండాలని కోరుతున్నాం. ఉచిత విద్యుత్ మగ్గం ఉన్న ప్రతి చేనేత కార్మికునకూ అవసరం. మరిన్ని వృత్తి ప్రోత్సాహకాలను ఆశిస్తున్నాం.

-ఆనెం సాంబమూర్తి, వస్త్రపురి కాలనీ, కాగువాడ

జిల్లాలో చేనేత సహకార సంఘాలు:	36
సంఘాల్లో ఉన్న సభ్యులు:	1950
చేనేతకు దూరంగా ఉన్నవారు:	840

చేనేత పరిశ్రమకు పూర్వ వైభవం..



2014-19లో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు చేనేత పరిశ్రమకు సంక్షేమ పథకాలు అమలుచేసి ఆదుకొంది. ఈ పర్యాయం థ్రిఫ్ట్ ఫండ్ సేవింగ్ స్కీం, యార్న్ సబ్సిడీ, ఉచిత విద్యుత్ ఇవ్వడం బాగుంది. మరిన్ని ప్రోత్సాహకాలతో టీడీపీ పాలనలో చేనేత పరిశ్రమకు పూర్వపు వైభవం వస్తుందని ఆశిస్తున్నాం.

-మంచు కృష్ణారావు, జాతీయ చేనేత సలహా సంఘ మాజీ సభ్యులు, కొరసవాడ

మందస మండలంలో..

హరిపురం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మందస మండలం బైరిసారంగపురం గ్రామంలో మహేదేవలింగేశ్వర చేనేత ఉత్పత్తి విక్రయ సహకార సంఘంలో 110 మంది సభ్యులు ఉన్నారు. సుమారు 46 చేతి మగ్గాలు ఉండగా... మరో 15 చేతిమగ్గాలు ఆర్థిక నష్టాలతో మూతపడ్డాయి. మగ్గాలపై ఆధారపడిన కుటుంబాలు సుదూర ప్రాంతాలకు వలస వెళ్లాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక సీఎం చంద్రబాబు చేనేతకు చేయూతనిచ్చే దిశలో మరమగ్గాలకు 500 యూనిట్లు, చేతి మగ్గాలకు 200 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్తును అందించి సహాయక చర్యలు చేపడుతున్నారు. దీంతోఆ వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది.

ఆనందదాయకం..



కూటమి ప్రభుత్వం వచ్చాక చేనేత సంఘా లను ఆదుకోవడానికి ముందుకు రావటం ఆనందదాయకం. సీఎం చంద్రబాబుకు వేలాది కుటుంబాలు రుణపడి ఉంటాం. వడ్డీలేని రుణాలతో పాటు ఆర్థిక భరోసా అందించే చర్యలు తీసుకోవాలి. చేనేత కుటుంబాలకు చెందిన యువతకు మగ్గాలపై, నూతన సాంకేతిక వినియోగంపై శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఆదుకోవాలి.

-కొల్ల దాలిబందు, పురుషోత్తం, చేనేత సంఘం అధ్యక్ష, కార్యదర్శులు


బీఎస్‌పురంలో మగ్గంపై నేస్తున్న కార్మికుడు కొనపల త్రినాథ్


దారం తీస్తున్న చేనేత కార్మికురాలు తేజేశ్వరి

సంస్కృతం.. ప్రాచీన భాష

● ఇతర దేశాల్లోనూ ఈ పదాల మూలాలు
● నేటి నుంచి సంస్కృత భాషా వారోత్సవాలు


వందేళ్ల కిందట సంస్కృత భాషలో ఉన్న నిఘంటువులు, భారతం, రామాయణం ప్రదర్శిస్తున్న భాస్కరభట్ల శ్రీరామ శర్మ

శ్రీకాకుళం కల్చరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్రాచీనభాష సంస్కృతం. ప్రపంచంలోని అనేక భాషలకు మూలం. మూడింట రెండొంతుల భాషల్లో సంస్కృతభాష ప్రభావం ఉంటుందని పండితులు చెబుతున్నారు. ఉత్తరాది భాషల్లోనే కాకుండా దక్షిణాదికి చెందిన ద్రవిడ భాషలలో సైతం సంస్కృతం మూలాలు ఉన్నాయంటారు. గురువారం నుంచి ఏడు రోజుల పాటు సంస్కృత భాషా వారోత్సవాలను పురస్కంచుకుని ఇంకా వారు ఏం చెబుతున్నారంటే..

● సంస్కృతంలో వైదిక శైలి, కావ్యశైలి అని రెండు ఉన్నాయి. కాళిదాసు, భారవి, దండి వంటి సుప్రసిద్ధ కవుల కాలం నుంచి లౌకిక సంస్కృతం ప్రాచుర్యం పొందింది. ఇండో యూరోపియన్ దేశాలలో ఈ భాష బాగా విస్తరించింది. ప్రపంచాన్ని ఏలుతున్న ఆంగ్లభాషలో అనేక పదాలు సంస్కృతం నుంచి వచ్చినవేనని చెబుతారు. భ్రాత్రూ అనే పదం నుంచి బ్రదర్ అని, మూడు అంకె నుంచి త్రీ అనే పదాలు ఉదాహరణగా చెప్పవచ్చు.

● వేదాలలో ప్రస్తావించబడిన ఆగ్నేయాస్త్రం.. అగ్నిక్షిపణి, వరుణాస్త్రం.. మేఘమథనం వంటివి సంస్కృతభాషతో నిండినవే. పూర్వం రాజులు ఈ భాషను బాగా పోషించేవారు. ఇతర దేశస్థుల దండయాత్రలు, ఆక్రమణల కారణంగా ఇప్పుడు ఇది మృతభాషగా మారిపోయిందని భాషాభిమానులు చెబుతున్నారు.

● జర్మనీకి చెందిన మాక్స్‌ముల్లర్ అనే పండితుడు భారత్‌కు వచ్చి సంస్కృతభాషను అధ్యయనం చేశారు. ఆయన జర్మన్, ఇంగ్లీషు భాషల్లోనికి వేదాలను అనువదించారు. దీని ప్రభావంగా జర్మనీ శాస్త్ర విజ్ఞానరంగం ప్రఖ్యాతి గాంచింది. ఆరో శతాబ్దంలో కాళిదాసు సంస్కృతంలో రచించిన అభిజ్ఞానశాకుంతలం ప్రపంచ స్థాయిలో నేటికీ ఉత్తమ నాటకంగా ఖ్యాతిని గడించింది.


ప్రముఖ అవధాని పైడి హరినాథ్

● ఈ భాష గురించి శ్రీకాకుళం నగరానికి చెందిన ప్రముఖ అవధాని పైడి హరినాథ్ ఏమంటున్నారంటే.. 'దేశీయ భాషలన్నింటిలోను నిండియున్నది సంస్కృతం. ఈ భాషలోనే భారతీయ వేద, సాహిత్య, శాస్త్ర సాంకేతిక విజ్ఞానమంతా నిక్షిప్తమై ఉంది. ఈ భాష మనోవికాసానికి సహకరించి మనిషిని వివేకవంతునిగా తయారు చేస్తుంది' అని అన్నారు.

● నగరానికి చెందిన సంస్కృత భాషా పండితుడు, సంస్కృత భారతి సాహిత్య సంస్థ వ్యవస్థాపకుడు భాస్కరభట్ల శ్రీరామశర్మ ఏమంటున్నారంటే.. 'సంస్కృతం దేవభాష. దేవనగరి లిపితో ప్రారంభమయింది. నగరంలో ఆర్య సంస్కృత భారతి సంస్థను స్థాపించాము. ఎంతోమంది విద్యార్థులకు సంస్కృత భాష పట్ల అవగాహన కల్పించాము. వారిలో కొంతమంది తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయంలో ప్రొఫెసర్లుగా పనిచేస్తుండడం నాకు ఆనందంగా ఉంది. ప్రతి ఏటా ఆగస్టు 7 నుంచి వారం రోజులు భాషా ఉత్సవాలు మా సంస్థలో నిర్వహిస్తున్నాము' అని అన్నారు.

బాధ్యులైన టీచర్లపై చర్యలు తప్పవు

ఆశ్రమ పాఠశాలను పరిశీలించిన అధికారులు


బాధ్యులైన టీచర్లను బదిలీ చేయాలని డిమాండ్ చేస్తున్న తల్లిదండ్రులు


ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులను విచారిస్తున్న అధికారులు

హరిపురం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గిరిజన ఆశ్రమ పాఠశాలలో వివాదానికి బాధ్యులైన ఉపాధ్యాయునిలపై చర్యలు తప్పవని ఐటీడీఏ డీడీ అన్నాదొరై హెచ్చరించారు. మందస మండలం పట్టులోగాం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను ఐటీడీఏ, రెవెన్యూ, విద్యాశాఖాధికారులు బుధవారం వేర్వేరుగా పరిశీలించారు. 'ఈ టీచర్లు మాకొద్దు' అంటూ విద్యార్థులు, తల్లిదండ్రులు నిరసన తెలియజేయగా.. ఆంధ్రజ్యోతిలో బుధవారం కథనం వెలువడింది. దీంతో పాఠశాలను ఐటీడీఏ డీడీ అన్నాదొరై, ఏటీడబ్ల్యూవో మల్లికార్జునరావు, తాహసీల్దార్ ఎం.శ్రీకాంత్, ఎంఈవో ఎం.లక్ష్మణరావు వేర్వేరుగా పరిశీలించి విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయినులను విచారించారు. బదిలీ చేసిన హెచ్‌ఎం రాజేశ్వరిని వెంటనే వెనక్కి రప్పించాలని, ఉపాధ్యాయినులు గీత, పద్మావతి, తేజేశ్వరిని వేరే పాఠశాలలకు బదిలీ చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. గిరిజన విద్యార్థులతో అసభ్యకరంగా మాట్లాడిన ఉపాధ్యాయినులపై చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘ నేతలు కూడా అధికారులకు విన్నవించారు. వివాదానికి కారణమైన ఉపాధ్యాయినులను వేరే పాఠశాలలకు బదిలీ చేయాలని కోరారు. అధికారులంతా నివేదికలు తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేయనున్నారు. వారి ఆదేశాలమేరకు తదుపరి చర్యలు తీసుకుంటారు.

పూండి రోడ్డుకు మోక్షం

(ఐదో పేజీ తరువాయి)

ప్రభుత్వం రూ.100కోట్లు నిధులు విడుదల చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ రోడ్డును నిర్మించనున్నాయి. ఈ రోడ్డు పనులు పూర్తయితే వాణిజ్య కేంద్రంగా పూండి మరింత అభివృద్ధి చెందుతుందనే ఆశాభావాన్ని ఈ ప్రాంత తీయులు వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యే కృషి మరువలేనిది..

పూండి రోడ్డు విస్తరణ చేపడతానని ఎన్నికల్లో ఇచ్చిన హామీని ఎమ్మెల్యే శిరీష నిలబెట్టుకున్నారు. నిధుల కోసం ఢిల్లీ వరకు వెళ్లి కేంద్రమంత్రులను ఒప్పించారు. ఆమె కృషి మరువలేనిది. రోడ్డు విస్తరణ పనులు పూర్తయితే పూండి ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుంది.

-పుచ్చ ఈశ్వరరావు, అగ్నికులక్షత్రియ డైరక్టర్, పూండి

మాదకద్రవ్యాలపై విస్తృత సోదాలు

● రైళ్లు, బస్సుల్లో తనిఖీలు చేసిన డాగ్‌స్క్వాడ్

పలాస, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల రవాణా నేరమని, దీన్ని ఎవరు తరలించినా, సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ హెచ్చరించారు. బుధవా రం పలాస రైల్వేస్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్ మార్కెట్ ప్రాంతాల్లో డాగ్‌స్క్వాడ్ బృందంతో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ముఖ్యరైళ్లలో అనుమానిత వస్తువులు, బ్యాగుల న్నీ తనిఖీలు చేశారు. మార్కెట్‌లోని హోల్‌సేల్ షాపుల్లో సోదాలు చేశారు. సీఐ మాట్లా డుతూ ప్రభుత్వం మాదకద్రవ్యాల నియంత్రణపై కఠిన చర్యలు తీసుకుంటోందని, ఇందులో భాగంగా అనుమానిత వస్తువులు తనిఖీలు చేస్తున్నామని అన్నారు. ఒడిశా నుంచి ఎక్కువగా గంజాయి రవాణా జరుగుతోందని, సరిహద్దులో నిఘా ఉధృతం చేశామని చెప్పారు.


బస్సులో బ్యాగులు తనిఖీ చేస్తున్న డాగ్‌స్క్వాడ్


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని

17న క్వాంటమ్ హ్యాకథాన్ పోటీలు

ఎచ్చెర్ల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ క్వాంటమ్ వ్యాలీలో ఈనెల 17న క్వాంటమ్ హ్యాకథాన్ పోటీలు నిర్వహిస్తు న్నట్లు వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని అన్నారు. ఈ మేరకు బుధవారం పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ పోటీల్లో గణితం, భౌతిక శాస్త్రం, కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు పాల్గొంటారన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులు బీఆర్‌ఏయూ తరఫున రాష్ట్ర స్థాయిలో జరిగే వ్యాలీ హ్యాకథాన్ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. క్యాంటమ్ కంప్యూటింగ్‌పై పీఎం-ఉషా పథకంలో భాగంగా వర్సిటీ ఫిజిక్స్ విభాగం ఆధ్వ ర్యంలో అధ్యాపకులకు సెప్టెంబరు 2 నుంచి మూడు రోజుల పాటు ఎఫ్‌డీపీ కార్యక్రమాన్ని నిర్వ హిస్తామన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఎస్. ఉదయ భాస్కర్, డాక్టర్ సీహెచ్‌రాజశేఖరరావు, ఎస్‌వో డాక్టర్ స్వామ్రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చినుకు జాడేదీ?

(ఐదో పేజీ తరువాయి)

తోడుదామన్న చెరువుల్లో చుక్కనీరు కూడాలేదు. దీంతో ఈ సీజన్‌లో పచ్చగా కనిపించాల్సిన పంట భూములు బీడుగా దర్శనమిస్తున్నాయి.

● మెళియాపుట్టి మండలంలో గత రెండు వారాల నుంచి వర్షాలు లేక వరి నారు, ఎదలు ఎండిపోతున్నాయి. కొంత మంది రైతులు చెరువుల వద్ద ఇంజన్లు ఏర్పాటు చేసుకొని నీరు పెడుతున్నారు. గత ఏడాది ఆగస్టు మొదటి వారానికే మండలంలో దమ్ములు పూర్తయ్యాయి. కానీ, ఈ ఏడాది వర్షాలు లేక దమ్ములు చేయలేని పరిస్థితి ఏర్పడింది.

● కొత్తూరు మండలంలో వర్షాలు ముఖం చాటేశాయి. గత రెండు వారాలుగా వానలు పడడం లేదు. పైగా ఎండల తీవ్రత కారణంగా వరి ఎదలు ఎండిపోతున్నాయి. తడిలేక నారు కూడా మాడిపోతుంది. గత ఎడాది ఆగస్టు నాటికి ఉభాలు పూర్తయ్యాయని, ఈ ఏడాది మాత్రం వర్షాలు లేక నాట్లు వేయలేకపోతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు.

ప్రాణాలు తీస్తున్న సరదా

(ఐదో పేజీ తరువాయి)

చెందిన విషయం తెలిసిందే. జిల్లాలో అత్యధికంగా సుమారు 194 కిలోమీటర్ల పొడవున సముద్ర తీర ప్రాంతం ఉంది. పర్యాటకులను ఆకర్షించేందుకు కొన్ని తీరాల వద్ద అధికారులు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. అయితే, పర్యాటకులు స్నానాల కోసం సముద్రంలోకి వెళ్లేటప్పుడు వారు తీసుకోవల్సిన తగు జాగ్రత్తలపై అధికారులు అవగాహన కల్పించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. భావనపాడు, శివసాగర్ తీరాల్లో గోతులు అధికంగా ఉండడంతోనే స్నానాలకు దిగిన వారు ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా మధ్యాహ్నం సమయంలో ఈ రెండు తీరాల్లో చిన్న కెరటాలకే ఇసుక మేటలు వేసి గోతులు ఏర్పడతాయని మత్స్యకారులు అంటున్నారు. స్నానాలకు దిగిన వారికి ఈ గోతులు కనిపించక, పైగా ఈత రాకపోవడంతో కెరటాలకు గల్లంతై మృతి చెందుతున్నారు. ప్రతి ఏటా ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ అధికారులు బీచ్‌ల వద్ద కనీస హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం లేదనే విమర్శలు ఉన్నాయి, మెరైన్, సివిల్ పోలీసులు సంయుక్తంగా తీరాల్లో పర్యటించి పర్యాటకులకు అవగాహన కల్పించడంతో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. కానీ, గత కొన్నేళ్లుగా వారు పట్టించుకోవడం లేదు. పర్యాటకులు ఎక్కువగా వచ్చే బారువ, శివసాగర్, భావనపాడు, మొగదలపాడు, కళింగపట్నం, గనగళ్లవానిపేట, తదితర బీచ్‌ల వద్ద రక్షణ బోట్లు, జాకెట్లు రిజర్వుగా ఉంచాలని, దీనివల్ల కొంతమంది ప్రాణాలైన కాపాడే అవకాశం ఉంటుందని మత్స్యకారులు చెబుతున్నారు. భావనపాడు బీచ్ వద్ద మంగళవారం ముగ్గురు విద్యార్థులు గోతుల్లో ఇరుక్కోని రక్షించాలని కేకలు వేసినా, ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోయారని దూరంగా ఉన్న పర్యాటకులు చెబుతున్నారు. ప్రతిరోజూ కనీసం ఒక పోలీసు అయినా తీరంలో గస్తీ కాస్తే ప్రమాదాలు నివారించవచ్చుననే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

జాగ్రత్తలు తీసుకోవాలి..

సముద్రం, నదులు, చెరువులు స్నానాలకు వెళ్లే సమయంలో యువత తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ఈత రాకుండా అక్కడికి వెళ్లవద్దు. ఒక్క నిమిషం సరదా కోసం ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు. కొన్ని దేశాల్లో పిల్లలకు చదువుతోపాటు ఈత నేర్పించడం కూడా ఒక భాగమే. కాలేజీలు, పాఠశాలల్లోనూ సముద్రం, నదుల ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి. దీనివల్ల వారు జాగ్రత్తలు తీసుకునే అవకాశం ఉంటుంది.

-డాక్టర్ కోదండరావు, పూండి

నగరంలో 'మాస్టర్ ప్లాన్' అమలుకు నిర్ణయం

శ్రీకాకుళం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరపాలక సంస్థ రూపొందించిన మాస్టర్ ప్లాన్‌ను ప్రభుత్వం ఆమోదించింది. 'శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ' (సుడా) రీజియన్‌లో మాస్టర్ ప్లాన్‌ను ఆమోదిస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డవలప్‌మెంట్ అధికారులు జీఓ 154 నెంబరుతో ఉత్తర్వులను విడుదల చేశారు. ఈమేరకు ప్రస్తుతం శ్రీకాకుళం నగరంలో 53.17 చదరపు కిలోమీటర్ల మేర ఈ మాస్టర్ ప్లాన్ వర్తిస్తుంది. ఇదివరకు కమర్షియల్, రెసిడెన్షియల్ జోన్‌ల వారీగా ఏర్పాటు చేసుకునేలా.. జోన్‌లను మిక్సింగ్ చేసుకునేలా వెసులుబాటు ఇచ్చింది. ఇందులో డెవలప్‌మెట్ ప్రమోషన్ జోన్, ప్రొటెక్టడ్ యూజ్, రెసిడెన్షియల్, కమర్షియల్ , మిక్స్‌డ్ యూజ్ జోన్, ఇండస్ట్రీయల్ యూజ్, పబ్లిక్ అండ్ సెమీ పబ్లిక్ యూజ్, పబ్లిక్ యుటిలిటీస్, రిక్రీయేషనల్ ఓపెన్ స్పేస్ యూజ్, ట్రాన్స్‌పోర్ట్, అగ్రికల్చరల్ యూజ్ జోన్‌ల ఏర్పాటుకు ఆమోదిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా మాస్టర్‌ప్లాన్ అమలు చేసేందుకు ఉత్తర్వులు జారీ చేయడంపై ఎమ్మెల్యే గొండు శంకర్ హర్షం వ్యక్తంచేశారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు నాయుడు, మునిసిపల్ మంత్రి నారాయణలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉమారుద్ర కోటేశ్వరాలయ చైర్మన్‌గా 'పాండ్రంకి'



ఎమ్మెల్యే శంకర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న దేవేంద్రనాయుడు

అరసవల్లి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): బలరామ ప్రతిష్ఠితమైన నగరంలోని ఉమారుద్ర కోటేశ్వర స్వామి ఆలయ పాలక మండలి చైర్మన్‌గా పాండ్రంకి దేవేంద్ర నాయుడు నియమితులయ్యారు. ఈ మేరక బుధవారం దేవదాయశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కమిటీ సభ్యులుగా కోరాడ రమేష్, కఠారి కమల, సాలిహుండాం శ్రీదేవి నియమితుల య్యారు. దేవేంద్ర నాయుడు 2000-2002 మధ్య కాలంలో ఇదే ఆల యానికి చైర్మన్‌గా వ్యవహరించారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే గొండు శంకర్‌ను బుధవారం దేవేంద్రనాయుడు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బూర్లె రమణమ్మ, ఎంవీఆర్ మూర్తి, తంగి సూర్యారావు ఉన్నారు.

విద్యార్థినుల భవిష్యత్‌కు ఎంవోయూ దోహదం

పాత శ్రీకాకుళం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థినుల భవిష్యత్‌కు సంస్థతో అవగాహన దోహదం చేస్తుందని ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయంప్రతిపత్తి) ప్రిన్సిపాల్ డా. కె.సూర్యచంద్రరావు అన్నారు. బుధవారం కళాశాలలో ఫ్రాంక్లిన్ టెక్ సిస్టం ప్రైవేట్ లిమిటెడ్ సంస్థతో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) చేసుకున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంస్థ సీవో ఆర్.శివకుమార్ మాట్లాడుతూ.. కేరీర్ అవేర్‌నెస్, ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌పై అవగాహన కల్పించారు. సాఫ్ట్‌వేర్ ప్రాజెక్టులు, కార్పొరేట్ సంస్థల శిక్షణ, కన్సల్టింగ్ సేవలు, పరిశ్రమ సహకారం, ఉద్యోగావకాశాలను వివరించారు. కార్య క్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొ న్నారు.

'బాట్లింగ్' హమాలీల పొట్టకొట్టొద్దు

ఎచ్చెర్ల, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్లలోని బాట్లింగ్ యూనిట్‌ను విభజించి హమాలీల పొట్ట కొట్టొద్దని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు అన్నారు. ఇక్కడి డిపోను విడదీసీ కొత్తగా టెక్కలిలో ఏర్పాటును నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం హమాలీలు చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలిపారు. 1986లో ఇక్కడ డిపో ఏర్పాటుకు భూములిచ్చిన దళితులకు హమాలీలుగా పని కల్పించారని, ఇప్పుడు దీనిని విభజించడం ద్వారా వారి ఉపాధికి గండిపడుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. టెక్కలి డిపో ఏర్పాటు ఉత్తర్వులను వెనక్కి తీసుకునేవరకు ఉద్యమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సంఘ నేతలు డి.బంగారాజు, టి.రామారావు, నిడిగింట్ల రమణ, శ్రీనివాసరావు, లండ సీతారాం, లింగాల రాము తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యసాధనపై అవగాహన

ఇచ్ఛాపురం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): లక్ష్యాన్ని సాధించాలన్నా, వాటిని చేరుకోవాలన్నా ఒక గోల్ అవసరమని జేసీఐ జోన్ ట్రైనర్ ఈశ్వర్ అన్నారు. బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దిగోల్ ఇంజన్‌పై అవగాహన కలిగించారు. ఆలోచనా దృక్పథాన్ని ఎలా మలచుకోవాలి, మానసిక స్థితిని ఎలా మెరుగుపరచుకోవాలనే అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, జేసీఐ క్లబ్ అధ్యక్షుడు కాళ్ల జయదేవ్, సెక్రటరీ డాక్టర్ మోహన్ వెంకటేష్, ఎన్ఎస్ఎస్ పీవో సంతోష్ కుమార్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ కార్యవర్గం

ఇచ్ఛాపురం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం మునిసిపాల్టీ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం మస్టర్ కార్యాలయంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రమేష్ పట్నాయక్, ఉపాధ్యక్షుడిగా హర్డిబో మద్ది, కార్యదర్శిగా డిల్లీ పూండి, సహాయ కార్యదర్శిగా డి. లక్ష్మణరావు, కోశాధికారిగా ఎన్.హరికృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన 'కలమట'

శ్రీకాకుళం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేష్‌ను టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ కలుసుకున్నారు. బుధవారం మంగళగిరిలో మంత్రిని కుమారుడు విద్యా సాగర్‌తో కలిసి కలిసి జిల్లాలోని ప్రస్తుత రాజకీయ పరిణామాలు, ప్రభుత్వ కార్యక్రమాల అమలు తీరును వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పార్టీ పరంగా మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

ప్రపంచశాంతి కావాలి

ఆమదాలవలస, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): హిరోషిమా నగరంపై జరిగిన అణుబాంబు దాడితో తీవ్ర నష్టం వాటిల్లిందని, ఇకపై యుద్ధం వద్దు శాంతిని కోరుదామని జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జేవీవీ ఆధ్వర్యంలో బుధవారం హిరోషిమా డే నిర్వహించారు. జేవీవీ రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ మాట్లాడుతూ.. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో అమెరికా హిరోషిమా నగరంపై చేసిన అణుబాంబు దాడి మానవాళి చరిత్రలో భయానక ఘట్టమన్నారు. ఇటీవల కాలంలో ఇజ్రాయిల్, పాలస్తీనా సంఘర్షణ, రష్యా-ఉక్రెయిన్ యుద్ధాలతో మానవాళికి ముప్పు వాటిల్లుతోందన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు యుద్ధం వద్దు ప్రపంచశాంతి కావాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు పి.మోహన్ రావు, పి.రామస్వామి నాయుడు, బీఏ శివరాజ్‌షావలి, టి.మనోహర్, సీహెచ్ సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సేవలందించేదెప్పుడు?

- పునాది దశలోనే టీడీవలస విలేజ్ హెల్త్ క్లినిక్
- వినియోగంలోలేని నడిమివలస భవనం



నిరుపయోగంగా నడిమివలస విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం (ఇన్‌సెట్‌లో) టీడీవలసలో పునాదుల స్థాయిలోనే..

జి.సిగడాం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయిలోనే వైద్య సేవలందించే దిశలో గత ప్రభుత్వ హయాంలో కేంద్రప్రభుత్వ సహకారంతో విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. వీటిలో కొన్ని భవనాలు పూర్తి కాగా, మరికొన్ని ఇంకా వివిధ దశల్లోనే ఉన్నాయి. అయితే గ్రామాలకు దూరంగా నిర్మించడంతో కొన్ని భవనాలను వినియోగించడం లేదు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. పైగా లక్షలాది రూపాయల ప్రజా ధనం వృథా అయిందన్న వాదనలు వినిపిస్తు న్నాయి. పూర్తయిన భవనాల్లో సేవలు అందించకపోవడంతో నిరుపయోగంగా ఉండి ఆకతాయిలకు అడ్డాగా మారుతున్నా యన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మండల పరిధిలోని టీడీవలస సచివాలయం పక్కన నిర్మించాల్సిన విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం పునాది స్థాయి దాటలేదు. ఇది ఎప్పటికి పూర్తవుతుందో అధికారులకే తెలియాలి. నడిమివలసలో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం పూర్తయినా నేటికీ అందులో సేవలు అందించడం లేదు. దీంతో ఈ భవనం పాడవు తోంది. పైగా అసాంఘిక కార్యకలా పాలకు నిలయంగా మారు తోంది. గ్రామానికి సుమారు ఒకటిన్నర కిలో మీటర్ల దూరంలో ఈ భవనం నిర్మించడంతో పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. దీంతో ఇటు ప్రజాధనం వృథా కావడమే కాకుండా భవనం దిష్టి బొమ్మలా దర్శనమిస్తూ లక్ష్యానికి దూరంగా ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతి నిధులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వారంలోగా 'తోటపల్లి' నీరందించాలి: ఎన్ఈఆర్

రణస్థలం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): తోటపల్లి ప్రాజెక్ట్ ద్వారా నియోజకవర్గంలోని శివారు గ్రామాలకు సాగునీటిని వారం రోజుల్లో అందించాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. తన క్యాంప్ కార్యాలయంలో బుధవారం తోటపల్లి ప్రాజెక్ట్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఖరీఫ్‌లో ప్రతి ఎకరానికి సాగునీరు అందించాలన్నారు. అనంతరం సూపరింటెండెట్ ఇంజనీర్‌తో ఫోన్‌లో ఎమ్మెల్యే మాట్లాడి సాగునీటి సరఫరాపై చర్చించారు.

ట్రూఅప్ చార్జీలు రద్దు చేయాలి

సోంపేట, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌మీటర్లు వద్దని, ట్రూఅప్ చార్జీలు రద్దు చేయాలని బుధవారం పట్టణంలో వామపక్ష నేతలు ర్యాలీ చేపట్టారు. ఎన్నికల ముందు స్మార్ట్ మీటర్లు పెడితే పగలగొట్టండని చెప్పి ఇప్పుడు ప్రభుత్వం ఏర్పాటుచేస్తోందని ఆరోపించారు. మరోసారి ప్రజలపై విద్యుత్‌భారం మోపేందుకు సిద్ధం అవుతోందని, ఈ నిర్ణయాలను వెంటనే విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు సంగారు లక్ష్మీనారాయణ, కె.గోపీనాథ్, జయరాం, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం తొలగింపు



అక్రమ నిర్మాణాన్ని కూల్చివేసిన దృశ్యం

ఇచ్ఛాపురం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): బస్టాండ్ జంక్షన్ వద్ద ప్రభుత్వ పాఠశాల ప్రహరీకి ఆనుకుని ఆటో యూనియన్ సభ్యులు చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని బుధవారం మునిసిపల్ అధికారులు తొలగించారు. అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని ఎస్ ఎంసీ చైర్మన్ ఆశి లత మునిసి పల్ అధికారులకు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన అధికా రులు సదరు నిర్మాణాన్ని పరిశీలించి తొలగించారు. స్పందించిన అధికారులకు ఎస్ఎంసీ చైర్మన్, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

శక్తియాప్‌ను సద్వినియోగం చేసుకోండి

ఇచ్ఛాపురం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): శక్తియాప్‌ను యువతులు, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఇచ్ఛాపురం రూరల్ ఎస్ఐ ఇ.శ్రీనివాసరావు అన్నారు. బిర్లంగిలో నారీశక్తి, శక్తి యాప్‌లపై బుధవారం అవగాహన కలిగించారు. బాల్యవివాహాలను నిరోధించాలన్నారు. ఆకతాయిలు వేధింపులకు గురిచేస్తే తక్షణం హెల్ప్‌లైన్ నెంబరు 112కు ఫోన్ చేయాలన్నారు. బాలికల రక్షణకు 1098, సైబర్ నేరాల నియంత్రణకు 1930 నెంబర్లకు డయల్ చేయాలని సూచించారు. కార్యక్రయంలో మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నారీశక్తిపై అవగాహన

గార, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నారీశక్తిపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ సీహెచ్ గంగరాజు అన్నారు. బుధవారం స్థానిక జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు నారీశక్తిపై అవగాహన కల్పించారు. మహిళా చట్టాలు, పోక్సో చట్టం, సైబర్ నేరాలు, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. హెచ్ఎం పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నానో ఎరువులను వినియోగించాలి: ఏడీఏ

కంచిలి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): నానో ఎరువుల వినియోగానికి రైతులు ముందుకు రావాలని సోంపేట ఏడీఏ భవానీ శంకర్ అన్నారు. డోల గోవిందపురం, పోలేరు రైతు సేవా కేంద్రాల పరిధిలో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రోన్‌ల ద్వారా నానో యూరియా, నానో డీఏపీ పిచికారీ కోసం రైతులు సిద్ధం కావాలన్నా రు. కౌలు రైతులకు పంటసాగు హక్కు పత్రాల వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో ఏవో కె.సురేష్, వీఏఏ మౌనిక, పూర్ణచంద్రబిసోయ్, పలువురు రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

17న నటీనటుల ఎంపికకు అడిషన్

శ్రీకాకుళం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): సినీ రచనా రంగం, నిర్మాణ దర్శకత్వ విభాగానికి చెందిన బల్లెడ నారాయణమూర్తి దర్శకత్వంలో తెరకెక్కనున్న కొత్త చిత్రానికి ఈనెల 17న నటీనటుల ఎంపికకు అడిషన్ నిర్వహిస్తున్నట్లు 'క్లాసిక్ కథా పిక్చర్స్ ప్రొడక్షన్' సంస్థ తెలిపింది. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ సినిమాకు హీరో, హీరోయిన్‌తో పాటు ఇతర పాత్రధారుల కోసం ఈ టాలెంట్ హంట్‌ను నిర్వహిస్తున్నట్లు పేర్కొంది. శ్రీకాకుళం బాపూజీ కళామందిర్‌లో ఈనెల 17న అడిషన్స్ ఉంటాయని, సినీ రంగంపై ఆసక్తి ఉన్నవారు రావొచ్చని, వారికి శ్రీకాకుళం యాస తప్పనిసరిగా వచ్చి ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న సపోర్టింగ్ నటీనటులు తమ ప్రతిభను నిరూపించుకోవచ్చని తెలిపారు. అడిషన్‌లో ఎంపికైన వారు సినిమాలో నటించేందుకు తమ తల్లిదండ్రుల నుంచి అనుమతి పత్రం తీసుకు రావాల్సి ఉంటుందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

విజేతలకు బహుమతులు

ఇచ్ఛాపురం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ న్యూజనరేషన్ మంత్ సందర్భంగా విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి బహుమతులను బుధవారం అందించారు. వ్యాసరచన, డ్రాయింగ్, హ్యాండ్ రైటింగ్ పోటీలు నిర్వహించారు. నెలరోజుల పాటు విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ మోహన్ వెంకటేష్ తెలిపారు. కార్య క్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.రామారావు, బి.షణ్ముఖరావు, డి.కృష్ణమూర్తి రెడ్డి, ఎం.నవీన్, దినేష్ పాల్గొన్నారు.

సాంబారు పలుచగా ఉంటే ఎలా?

- ఫుడ్ కమిషన్ సభ్యుడు కాంతారావు
- శాలిహుండం కేజీబీవీ తనిఖీ



విద్యార్థినులతో మాట్లాడుతున్న కాంతారావు

గార, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): సాంబారు ఇలా పలుచగా, ఉప్పు తక్కువగా ఉంటే విద్యా ర్థినులు ఎలా ఆహారాన్ని తింటారని ఫుడ్ కమిటీ సభ్యుడు కాంతారావు ప్రశ్నించారు. బుధవారం రాత్రి శాలిహుండం కేజీబీవీని ఆకస్మి కంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంట గదిలో విద్యార్థినుల కోసం తయారు చేసిన భోజన పదార్థాలను పరిశీలించారు. సాంబారును చూసిన ఆయన ఆశ్చర్యం వ్యక్తంచేస్తూ రుచి చూశారు. పలుచగా ఉండడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. రాత్రికి ఎంతమంది విద్యార్థినులకు భోజనం పెడుతున్నారని సిబ్బందిని అడిగారు. 280 మందికి వంటచేసినట్లు వారు తెలుపగా సాంబారు పలచగా ఉండడం ఏమి టని, చిక్కగా రుచిగా ఉండేలా వండి పెట్టాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.బేబిశ్రీదేవిని ఆదేశించారు. ప్రభుత్వం నిర్ణయించిన మెనూలో తేడాలుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని బాగా చదువుకోవాలని విద్యార్థినులను కోరారు. ఆయనతో పాటు డీఎస్‌వో సూర్య ప్రకాశరావు, తహసీల్దార్ ఎం.చక్రవర్తి, ఆర్ఐ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శిరీషపై 'సీదిరి' నిందారోపణలు సరికాదు

- కళింగకోమటి సంఘ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందరాజులు



మాట్లాడుతున్న బోయిన గోవిందరాజులు

శ్రీకాకుళం అర్బన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మా సామాజికవర్గంలోని భార్యాభర్తల తగాదా విషయంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష డబ్బులు తీసుకున్నారని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు నిందారోపణలు చేయడం సరికాదని కళింగ కోమటి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోయిన గోవిందరాజులు అన్నారు. నగరంలోని కళింగ వైశ్య కల్యాణ మండపంలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. భార్యాభర్తల మధ్య వివాదం ఉందని పలాసకు చెందిన తంగుడు కవిత గతంలో వైసీపీ నాయకులు చుట్టూ తిరిగినప్పటికీ పరిష్కారం చూపలేదన్నారు. అప్పటి మంత్రి సీదిరి అప్పలరాజు ను ఆశ్రయించినా పట్టించుకోలేదన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత న్యాయం చేయాలని తమ సామాజికవర్గంలో ఉన్న వైసీపీ, టీడీపీ పెద్దలందరితో పాటు ఎమ్మెల్యే శిరీషను కలిశారన్నారు. మానవత్వంతో శిరీష స్పందించి ఎస్పీతో పాటు ఇరువర్గాలతో చర్చించి కవితను అత్తవారింటికి పంపించారన్నారు. అయితే ఈ విషయంలో ఎమ్మెల్యే శిరీషను దోషిగా చూపించాలన్న కుట్రతో అప్పలరాజు అవమానించేలా మాట్లాడడం తగదన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. సమావేశంలో కళింగ కోమటి సంఘ నేతలు కోరాడ హరగోపాల్, జామి భీమశంకర్, అంధవరపు ప్రసాద్, కోరాడ రమేష్, చైతన్య ప్రభు, పెదబాబు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సమానత్వం పెంచేందుకు..

- యూ ఆకారంలో తరగతి



విద్యార్థులను యూ ఆకారంలో కూర్చోబెట్టి బోధన చేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఈదుపురం (ఆర్) మండల పరిషత్ మోడల్ ప్రైమరీ పాఠశాలలో విద్యార్థులను బుధవారం యూ ఆకారంలో కూర్చొనబెట్టి బోధన చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో కురమాన అప్పారావు మాట్లాడుతూ.. నూతన విద్యా విధానంలో భాగంగా విద్యార్థు ల్లో అసమానతలు, అపోహలు తొలగించేందుకు ఈ యూ ఆకారంలో బోధన దోహదపడుతుందన్నారు. దీనివల్ల విద్యార్థుల్లో తామంతా సమానమనే భావన కలుగుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం మార్కండేయ బిసాయి, ఉపాధ్యాయులు సీతాపతి, చంద్రశేఖరం పాల్గొన్నారు.

అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న మెరైన్ సీఐ రమేష్

సోంపేట, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మెరైన్ సీఐ వి.రమేష్ అన్నారు. బారువ కొత్తూరులో మత్స్యకారులకు బుధవారం అవగాహన కలిగించారు. సముద్ర మార్గం గుండా అపరిచిత వ్యక్తుల వస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. తుఫాన్ల సమయంలో సముద్రంలోకి వేటకు వెళ్లే సమయంలో లైఫ్‌బోట్లు ఉండాలని, పడవపై దేశ జెండా తప్పనిసరిగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వో భగీరథి, హేమలత, హైమావతి, నాయకులు అమర లోకనాథం పాల్గొన్నారు.

10న మండల సమావేశం

గార, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 10న ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ గొండు రఘురాం అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో రఘు తెలిపారు. మండల అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలన్నారు.

న్యూస్ బాక్స్

మృతుడి కుటుంబానికి సాయం

సోంపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పలాసపురం గ్రామానికి చెందిన అశోక్ పాణిగ్రాహి ఇటీవల మృతి చెందారు. బ్రాహ్మణ అర్చక సంఘం నేతలు రూ.1.10 లక్షలను ఆయన కుటుంబ సభ్యులకు బుధవారం అందించారు. కార్యక్రమంలో సంఘ నేతలు సింహాచల పాడి, రమేష్‌కుమార్ పాణి గ్రాహి, కూర్మనాథ పాణిగ్రాహి పాల్గొన్నారు.

బాల్యవివాహాన్ని అడ్డుకున్న ఐసీడీఎస్ సిబ్బంది

ఇచ్ఛాపురం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతబజారు వీధిలో బాల్యవివాహాన్ని ఐసీడీఎస్ అధికారులు అడ్డుకున్నారు. 9వ తరగతి చదువుతున్న 14ఏళ్ల బాలికకు వివాహం చేసేం దుకు కుటుంబసభ్యులు ఏర్పాటు చేస్తున్నారన్న సమాచారంతో ఐసీడీఎస్ సీడీపీవో ఎం.రాజేశ్వరి, సూపర్‌వైజర్ సుజాత వివాహాన్ని అడ్డుకున్నారు. కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

'యుక్తధార్'పై అవగాహన

ఇచ్ఛాపురం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన 'యుక్తధార్'పై ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి ఏపీడీ సీహెచ్ శ్రీనివాసరెడ్డి ముఖ ఆధారిత హాజరు, ఈఎంఎంఎస్ ద్వారా హాజరు పంపడం, సెక్యూరిటీ లాగిన్‌లపై క్షేత్రసహాయకులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామారావు, ఏపీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రథమ చికిత్సపై శిక్షణ

అరసవల్లి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక మహిళా జూనియర్ కళాశాలలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ప్రథమ చికిత్స గుండె పునరుత్తేజం (సీపీఆర్) తదితర అంశాలపై అవగాహన కలిగించారు. విపత్తుల సమయంలో స్పందించాల్సిన విధానాన్ని శిక్షకులు వివరించారు.

సోలార్ లైట్ అందజేత

కంచిలి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పురుషోత్తపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు గ్రామస్థుడు కిల్లంశెట్టి మోహన్‌రావు రూ.11 వేలు విలువ చేసే సోలార్ లైట్‌ను బుధవారం హెచ్ఎం ఎస్.శారదకు అందజేశారు.

ఉల్లిపాయల చెరువులో ఉపాధి పనులకు అనుమతి

- ధ్రువీకరణ పత్రం అందించిన తహసీల్దార్



క్లియరెన్స్ సర్టిఫికెట్ అందిస్తున్న తహసీల్దార్

సోంపేట రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): గొల్లగండి పంచాయతీ గొల్లగండి ఉల్లిపాయల చెరువులో ఎన్ఆర్ఈజీఎస్‌లో వేతనదారుల ద్వారా చెరువు మరమ్మతులు, అభివృద్ధి పనులు చేపట్టవచ్చని అధికారులు స్పష్టం చేశారు. ఈ మేరకు ఇరిగేషన్ శాఖ నుంచి వచ్చిన అనుమతి పత్రాలను బుధవారం తహసీల్దార్ అప్పలస్వామి గ్రామస్థులకు అంద జేశారు. వివరాలిలా ఉన్నాయి.. సోంపేట బీలలో ఎన్‌సీసీ కంపెనీ థర్మల్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు గాను గొల్లగండి పరిధిలో ఉన్న 12 ఎకరాలు ఉల్లిపాయల చెరువును ప్రభుత్వం తమకు అప్పగించిందని కంపెనీ ప్రతినిధులు చెప్పడంతో గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. చెరువు భూమిపై తమకు హక్కు ఉందని కంపెనీ అభ్యంతరం తెలిపింది. దీనిపై మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు గండుపల్లి చిన్న రాజారావు రెవెన్యూ, ఇరిగేషన్‌శాఖ అధికారులకు వినతి పత్రాలు అందించారు. విచారణ అనంతరం చెరువు భూమిపై ఎటువంటి అలియేషన్స్ జరగ లేదని, ఎన్‌సీసీ సంస్థకు ఎటు వంటి భూ కేటాయింపు జరగ లేదని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో సదరు చెరువులో ఉపాధి పనులు చేపట్టుకోవచ్చని అధికారులు పేర్కొన్నారు.

సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యే అశోక్‌బాబు, సుడా చైర్మన్ రవికుమార్, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి రాజు, కలెక్టర్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ వంతెనలు దాటితే.. గండం గడిచినట్టే!

- కూలేందుకు సిద్ధంగా బ్రిడ్జిలు
- భయాందోళనలో వివిధ గ్రామాల ప్రజలు
- పట్టించుకోని అధికారులు

కోటబొమ్మాళి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధి వంశధార ఎడమ ప్రధాన కాలువపై వివిధ గ్రామాల వద్ద 50 ఏళ్ల కిందట నిర్మించిన వంతెనలు శిథిలావస్థకు చేరుకుని కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఈ వంతెనలపై రాకపోకలు సాగించేందుకు భయాందోళన చెందుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కిష్టుపురం, పాకివలస, కన్నేవలస గ్రామాల వద్ద ఐదు దశాబ్దాల నిర్మించిన ఈ వంతెనలు ప్రమాదకరంగా మారాయి.

- కిష్టుపురం వద్ద ఉన్న వంతెన మీదుగా నీలంపేట, తాటిపర్తి, జమచక్రం, మాసాహెబ్‌పేట, ఎండపేట, పట్టుపురం తదితర పంచాయతీల పరిధిలో 15 గ్రామాల ప్రజలు మండల కేంద్రం కోటబొమ్మాళితో పాటు జాతీయ రహదారికి చేరుకొని సుదూర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ వంతెన రైలింగ్ ఊడిపోయి గడిచిన ఐదేళ్లలో ఐదుగురు వంశధార కాలువలో పడి గల్లంతయ్యారు.
- పాకివలస వద్ద నిర్మించిన వంతెన కూడా ఇదే పరిస్థితిలో కొట్టుమిట్టాడుతుంది. ఈ వంతెన ఏక్షణానైన కూలితే కురుడు, దంత, కొత్తపల్లి, రామక్రిష్ణాపురం, సరియాపల్లి తదితర పంచాయతీల పరిధిలో 30 గ్రామాల ప్రజలకు రహదారి సౌకర్యం నిలిచిపోతుంది. మండల కేంద్రంతోపాటు టెక్కలి డివిజన్, జిల్లా కేంద్రానికి రాకపోకలు స్తంభించి పోయే ప్రమాదం ఉంది.
- కన్నేవలస వంతెన పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఈ వంతెన మీదుగా వచ్చిన టాక్టర్లు, ద్విచక్ర వాహనాలు తరచూ ప్రమాదానికి గురవుతున్నా పట్టించుకున్న దాఖలు లేవని ఆయా గ్రామస్థులు వాపోతున్నారు. ఈ వంతెనలు మీదుగా వెళ్లిన గ్రామాలకు రహదారులు నిర్మాణాలు ఎన్నో సార్లు చేపట్టారు కానీ ఈ వంతెనకు మరమ్మతులు చేయలేదు.

ఈ వంతెనల పునర్నిర్మాణంపై సంబంధిత అధికారుల దృష్టి సారించకపోవడంపై ఈ ప్రాంత ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోజురోజుకీ ఈ వంతెనల పరిస్థితి దారుణంగా తయారవుతుందని, ఏ క్షణమైనా కూలిపోవచ్చునని ఇలాంటి పరిస్థితి రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



రైలింగ్ ఊడి ప్రమాదకరంగా ఉన్న కిష్టుపురం వంతెన



ప్రమాదాలకు నిలయంగా మారిన పాకివలస వంతెన



కూలేందుకు సిద్ధంగా ఉన్న కన్నేవలస వంతెన

ప్రతిపాదనలు పంపించాం

వంశధార కాలువపై ఉన్న వంతెనలు శిథిలావస్థకు చేరాయి. వాటిని పునఃనిర్మాణం చేపట్టడానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు విడుదలైన వెంటనే నిర్మాణం చేపడతాం.

- ధర్మాన లోకేష్, వంశధార ఏఈ, కోటబొమ్మాళి

బ్రిడ్జికి మరమ్మతులు లేవు

పాకివలస వద్ద ఉన్న బ్రిడ్జి యాంగిలర్లు వంగి కూలేదశకు చేరి పదేళ్లు అయింది. కనీసం మరమ్మతులు చేపట్టడంలో అధికారులు శ్రద్ధ వహించడం లేదు. కాలువలో పడి ప్రమాద బారినపడిన ఘటనలు అనేకం ఉన్నాయి. ఇప్పటికైన అధికారులు మొద్దు నిద్ర వీడి వంతెన నిర్మాణం చేపట్టాలి.

- తోట శ్రీరామ్, పాకివలస

ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా?

వంశధార కాలువలపై బ్రిడ్జిలు కూలే దశకు చేరినా అధికారుల్లో చలనం లేదు. అన్ని పార్టీల నాయకులు ఈ గ్రామాలవైపు వచ్చినప్పుడు ఈ బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాలని అధికారులకు సూచిస్తున్నారే తప్పా అది కార్యరూపం దాల్చటం లేదు.

- కాళ్ల గణపతి, కన్నేవలస

21.5 కిలోల గంజాయి స్వాధీనం

- మైనర్, మరో ముగ్గురు అరెస్టు
- సీఐ సత్యనారాయణ



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సత్యనారాయణ

ఆమదాలవలస, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు యువకులతో పాటు ఒక మైనర్‌ను అరెస్టు చేసి, వారి నుంచి 21.5 కిలోలు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ పి.సత్యనారాయణ తెలిపారు. బుధవారం పోలీసు స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మునిసిపాలిటీ పరిధి 18వ వార్డు కంద్రపేట శ్మశాన వాటిక వద్ద ఎస్ఐ బాలరాజు సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఈ తనిఖీలో ఇద్దరు యువకులు ఒక మైనర్ గంజాయితో పట్టుబడ్డారు. కొత్త కంద్రపేటకు చెందిన కారుణ్య జగదీష్, ఐదో వార్డు సొట్టవానిపేట టీజీఆర్ నగర్ కాలనీకి చెందిన సయ్యద్ తహీర్‌బాబుతో పాటు ఒక మైనర్ గంజాయిని ఒడిశా రాష్ట్రం కల్లికోట్‌కు చెందిన నీలాంచల్ పట్నాయక్ వద్ద కొనుగోలు చేసి రైలులో ఆమదాలవలసకు తీసుకువస్తూ కొంత వీరు సేవించి.. మరికొంత విక్రయిస్తుండేవారు. ఈ నేపథ్యంలోనే బుధవారం కూడా గంజాయిని కొనుగోలు చేసి తీసుకువస్తుండగా పట్టుబడ్డారు. గంజాయిని ఒడిశాకు చెందిన నీలాంచల్ పట్నాయక్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు కారుణ్య జగదీష్‌పై ఇప్పటికే తొమ్మిది కేసులున్నాయని, 2024లో గంజాయి కేసు నమోదైందని ఇతడిపై స్టేషన్‌లో హిస్టరీషీట్ కూడా ఉన్నట్టు తెలిపారు. సయ్యద్ తాహిర్‌పై రెండు దొంగతనాల కేసులున్నాయన్నారు. కేసు నమోదు చేసి, నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించనున్నట్టు తెలిపారు. మైనర్‌ను జువైనల్ హోంకు తరలిస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

నరసన్నపేట, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): శుభకార్యక్రమానికి వెళ్లి వస్తూ.. రోడ్డు ప్రమాదంలో శ్రీకాకుళం పట్టణం బలగ ఆదివారంపేటకు చెందిన దమ్ము నూకలమ్మ (62) బుధవారం మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నూకలమ్మ తన కుమారుడు సుధాకర్‌తో కలిసి దిచక్రవాహనంతో కోటబొమ్మాళి మండలం కొత్తపల్లిలో జరిగిన ఒక శుభ కార్యక్రమానికి వెళ్లారు. తిరుగు పయణంలో తామరాపల్లి శివారులో పశ్చిమబెంగాల్ నుంచి స్పోర్ట్స్ బైక్‌పై వస్తున్న వ్యక్తి బలంగా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం వెనుక భాగాన కూర్చొన్న నూకలమ్మకి బలమైన గాయాలు కాగా.. సుధాకర్‌కి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల సాయంతో 108వాహనంలో పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ అసిరినాయుడు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు..

శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందినట్టు రెండో పట్టణ పోలీసులు తెలిపారు. వారు తెలిపిన సంతకవిటి మండలం జీఎన్ పురానికి చెందిన గురుగుబిల్లి పృథ్వీరాజ్ (25) నగరంలోని ఓ బంగారం దుకాణంలో పనిచేస్తూ డైమండ్ పార్క్ వద్ద తన స్నేహితులతో కలిసి ఉంటున్నాడు. ఈ నెల 4న కడుపునొప్పి తట్టుకోలేక పాయిజిన్ తాగి అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే సహచరులు గమనించి చికిత్స నిమిత్తం 108లో రిమ్స్‌కు తరలించారు. అనంతరం అతని మేనమామకు సమాచారం ఇచ్చారు. అతను వచ్చి మెరుగైన చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలి

హరిపురం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఇటీవల బదిలీపై వివిధ కేటగిరి పోస్టుల్లో చేరిన ఉపాధ్యాయులకు త్వరితగతిన జీతాలు అందేలా చర్యలు చేపట్టాలని ఏపీటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు కిరణ్‌కుమార్, సుందరరావు కోరారు. మందస మడలంలోని హరిపురం, బాహడాపల్లి, సువర్ణాపురం, మఖరజోల, దున్నూరు, సరియాపల్లి తదితర గ్రామాల్లోని పాఠశాలలను వారు బుధవారం సందర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నేతలు రామారావు, పురుషోత్తం, మన్మథరావు, చిరంజీవి, తాతారావు, మురళీమోహన్, భైరాగి పాల్గొన్నారు.

క్రీడలతోనే జాతీయ స్థాయిలో గుర్తింపు

జలుమూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో రాణిస్తే జాతీయ స్థాయిలో గుర్తింపు వస్తుందని ప్రిన్సిపాల్ రఘుపాత్రుని శివకుమార్ అన్నారు. కరవంజ ఆదర్శ పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు పురస్కరించుకొని బుధవారం ఆటలు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతోనే మానసిక ఉల్లాసం వస్తుందన్నారు. ప్రాథమిక స్థాయి నుండే విద్యార్థులు విద్యతో పాటు ఆటపాటలపై ఆసక్తి చూపాలన్నారు. విజేతలకు స్వాతంత్ర దినోత్సవం రోజున బహుమతులు అందచేస్తామన్నారు.

బస్సుల కండీషన్ పరిశీలన

పలాస, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్న నేపథ్యంలో విజయనగరం చీఫ్ మెకానికల్ ఇంజనీర్ కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో అధికారుల బృందం పలాసలో ఆర్టీసీ బస్సుల కండీషన్, మెంటీనెన్స్ విధానాన్ని పరిశీలించారు. మంగళ, బుధవారాల్లో అధికారులు డిపో కార్యాలయంలో మొత్తం బస్సులన్నీ పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ బస్సులకు టెస్ట్‌డ్రైవ్ నిర్వహించామన్నారు. అసిస్టెంట్ ఇంజనీర్ చాణుక్య, డిపో మెకానిక్ ఇంజనీర్ హేమంత్ కిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ క్రమశిక్షణ కలిగిన పార్టీ

పలాసరూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): టీడీపీ క్రమశిక్షణ కలిగిన పార్టీ అని, అటువంటి పార్టీలో ఉన్న ఎమ్మెల్యే గౌతు శిరీష, ఆ కుటుంబంపై నిందలు వేయడం వైసీపీ నేతలకు తగదని పీఏసీఎస్ చైర్మన్ వంకల కూర్మారావు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ఇటీవల ఎమ్మెల్యే గౌతు శిరీషను కించపర్చి మాట్లాడడం సరికాదన్నారు. గత వైసీపీ పాలనలో జరిగిన అభివృద్ధి ఏమీ లేదని, మంత్రిగా మీరు చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలన్నారు. ఇప్పటికైనా ఇటువంటి దూషణలు మానుకోవాలని ఆయన హితవులపలికారు.

నీలమణిదుర్గ హుండీల ఆదాయం రూ.6.29లక్షలు

పాతపట్నం, ఆగస్టు 6(ఆంధ్ర జ్యోతి): పాతపట్నం నీలమణి దుర్గ ఆలయానికి 55 రోజులకు గానూ రూ.6,29,838 ఆదాయం లభించినట్టు ఈవో టి.వాసుదేవ రావు తెలిపారు. ఆలయంలోగల ధర్మహుండీలను దేవదాయశాఖ సహాయ కమిషనర్‌వారి ఆదేశాలమేరకు టెక్కలి గ్రూప్ దేవాలయాల ఈవో టీపీ మనస్వి పర్యవేక్షణలో హుండీలను బుధవారం లెక్కించారు. అర్చకులు, వేంకటేశ్వరస్వామి సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆసుపత్రికి చేరిన వ్యాక్సిన్లు

టెక్కలి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర ఆసుపత్రికి అవసరమైన వ్యాక్సిన్లు చేరాయి. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో వ్యాక్సిన్ కొరతపై కథనం ప్రచురించడంతో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు బుధవారం నాటికి అన్నిరకాల వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచారు. డీపీటీ, ఐపీవీ, ఎంఆర్, రోటా, ఓపీవీ వంటి వ్యాక్సిన్లను సిద్ధం చేశారు. అలాగే కె.కొత్తూరు దరి పీహెచ్‌సీ సిబ్బందిచే వ్యాక్సిన్లను చిన్నారులకు అందజేశారు.

రికార్డులు పూర్తిచేయాలి

ఎల్ఎన్ పేట, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పథకం ద్వారా వేతనదారులు చేసిన పనుల ప్రాప్తికే రికార్డులన్నింటిని పూర్తిచేయాలని ఏపీవో శ్రీదేవి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి సిబ్బంది, ఫీల్డ్‌అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. నీటిగుంతలు, సో ఫ్‌పీట్స్, వర్మీకంపోస్టులతోపాటు వివిధ రకాల పనులు చేపట్టాలన్నారు. సోషల్ ఆడిట్‌లో తప్పిదాలు గుర్తిస్తే సంబంధిత ఫీల్డ్‌అసిస్టెంట్లపైన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఈసీ, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్, టైలరింగ్ షాపుల్లో చోరీ

- రూ.1.20 లక్షల నగదు, దుస్తులు అపహరణ



టైలరింగ్ షాపులో సీసీ కెమెరాకు చిక్కిన ముసుగుదొంగ



సెల్‌ఫోన్ షాపులో ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

పలాస, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పోలీసు పహరా ఉండే కాశీబుగ్గ కేటీ రోడ్డు శ్రీనివాస లాడ్జి జంక్షన్ వద్ద మంగళవారం అర్థరాత్రి దాటిన తరువాత దొంగలు రెచ్చిపోయారు. ఓ సెల్‌ఫోన్ షాపులో తాళాలు విరగ్గొట్టి షాపులో వివిధ వ్యాపారులకు చెల్లించడానికి దాచి ఉంచిన నగదు రూ.1.20 లక్షలు అపహరించారు. దానికి సమీపంలో ఉన్న ఓ టైలరింగ్ షాపులో ప్రవేశించి అందులో నగదు ఏదీ లభ్యం కాకపోవడంతో దుస్తులను అపహరించారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. బ్రాహ్మణతర్లా గ్రామానికి చెందిన నిమ్మన షన్ముఖరావు కేటీ రోడ్డులోని బాలాజీ సెల్‌ఫోన్ సర్వీసింగ్ సెంటరు నిర్వహిస్తున్నారు. దీనికి ఆనుకొని ఓ టిఫిన్ షాపును కూడా వీరే నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం వేకువజాము యజమాని షన్ముఖరావుతో పాటు ఆయన సోదరుడు యువరాజ్ షాపు వద్దకు వచ్చేసరికి తాళాలు విరగొట్టి షట్టర్ తెరిచి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే క్యాష్ కౌంటరులో నగదు చూడగా మాయం అయినట్టు గుర్తించారు. వెంటనే కాశీబుగ్గ పోలీసులకు సమాచారం అందించారు. సీఐ పి.సూర్యనారాయణ, క్లూస్‌టీమ్ సభ్యులు ఘటన స్థలానికి వచ్చి ఆ ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించి ఆధారాలు సేకరించారు. అదేవిధంగా పలాసలో నివాసం ఉంటున్న జినగ గోపాల్ కేటీ రోడ్డు గున్నేశ్వర నగర్‌లో స్టైలిస్ట్ టైలరింగ్ షాపు నిర్వహిస్తున్నారు. మంగళవారం అర్థరాత్రి దాటిన తర్వాత 2 గంటల సమయంలో ముసుగువేసుకున్న ఓ అగంతకుడు ప్రవేశించి షాపులో క్యాష్‌బాక్స్‌ను తెరిచాడు. అందులో ఏమీ లభించకపోవడంతో వినియోగదారులకు అందించాల్సి ఉన్న దుస్తులను అపహరించుకుపోయాడు. బుధవారం ఉదయం షాపు తెరిచేందుకు వచ్చిన యజమానికి తాళాలు బద్దలు కొట్టినట్టు కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. షాపులో సీసీ కెమెరాలో ఓ దొంగ ఉన్నట్టు గుర్తించారు. అయితే ముసుగు ధరించడంతో ఆయన్ను పోల్చుకోవడం కష్టంగా మారింది. మొత్తం రెండు కేసులకు సంబంధించి ఆయా ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

గొటివాడ వీఆర్వోకు షోకాజ్ నోటీసు

జలుమూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): గొటివాడ వీఆర్వో టి.సింహాచలానికి బుధవారం షోకాజ్ నోటీసు జారీచేసినట్టు తహసీల్దార్ జె.రామారావు తెలిపారు. గత నాలుగు రోజులుగా విధులకు డుమ్మాకొట్టి రైతులకు అందుబాటులో లేకుండా ఉండడంతో చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. కనీసం ఫోన్ చేసినా స్పందించడం లేదని పలువురు రైతులు ఫిర్యాదు చేశారని తెలిపారు. వారం రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని లేకుంటే, క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు.

తహసీల్దారు, ఏడీఏ విచారణ

కొత్తూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): కురిగాంలో ఎరువులు పంపిణీలో వచ్చిన ఆరోపణలపై తహసీల్దార్ కె.బాలకృష్ణ, వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏడీఏ) బి.రాజగోపాలరావు విచాణ నిర్వహించారు. రైతులకు ఎరువులు అందడం లేదని గ్రామానికి చెందిన కొంతమంది ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్, ఏడీఏ బుధవారం గ్రామం వెళ్లి రైతులతో మాట్లాడారు. ప్రతీ 1బీకి బస్తా యూరియా, డీఏపీ ఇచ్చినట్టు గుర్తించామన్నారు. అనంతరం గ్రామ సచివాలయం పరిధిలో ఉన్న రైతు సేవా కేంద్రాలు పరిధిలో పంపిణీ చేసిన రైతుల జాబితాను పరిశీలించారు. కార్యక్రమంలో ఏవో స్వర్ణలత, సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

సక్రమంగా బోధన చేయాలి

పలాస, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మారిన సిలబస్‌కు అనుగుణంగా విద్యార్థులకు బోధన చేయాలని ఇంటర్ డీవీఈవో దుర్గారావు కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రణాళికబద్ధమైన బోధనలు చేయాలని, ఈ ఏడాది మంచి ఫలితాలు సాధించడానికి అధ్యాపకులు కృషి చేయాలన్నారు. విద్యార్థులకు ఉన్న పాఠ్యాంశంలో సందేహాలను నివృత్తి చేయాలని, కార్పొరేట్ కళాశాలలకు ధీటుగా బోధన జరగాలన్నారు. అంతకు ముందు విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.నర్సింహమూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఐటీడీఏ ఏర్పాటు చేయాలి

మెళియాపుట్టి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మెళియాపుట్టిలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పెద్దమడిలో ఆదివాసీ జెండాను ఆవిష్కరించారు. గిరిజన గ్రామాల్లో ఐదో షెడ్యూల్ చెర్చలని డిమాండ్ చేశారు. కౌలురైతు సంఘం నాయకులు పోలాకి ప్రసాదరావు, సీఐటీయూ నాయకులు సూర్యయ్య, తదితరులు ఉన్నారు.

త్వరలో డీఎస్సీ ఫలితాలు

(ఐదో పేజీ తరువాయి)

చిత్తూరు, కర్నూలు జిల్లాలకు వెళ్లి డీఎస్సీ రాశారు.

పోటీ భారీగానే..

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అదుగో ఇదుగో అంటూ ఊరించడమే తప్ప ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ ప్రకటించి పరీక్షలు కూడా నిర్వహించింది. జిల్లాలో మెగా డీఎస్సీ ద్వారా జడ్పీ, మున్సిపల్, ప్రభుత్వ మేనేజ్‌మెంట్ పాఠశాలల్లో 458 పోస్టులు, ఏజెన్సీ ప్రాంతంలో 85 పోస్టులు మొత్తం 543 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ కానున్నాయి. ఈ పోస్టుల కోసం సుమారు 35వేల మంది పోటీపడుతున్నారు. పోస్టుల సంఖ్య స్వల్పంగా ఉండడం, పోటీ తీవ్రంగా ఉండడంతో ఎవరికి ఉద్యోగం వస్తుందోనని అభ్యర్థులు ఆత్రంగా ఎదురుచూస్తున్నారు. ఈ నెలాఖరు లేదా సెప్టెంబరు మొదటి వారంలో పోస్టుల భర్తీ ప్రక్రియ చేపట్టనున్నట్లు పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. మరికొద్ది రోజుల్లోనే కొత్త ఉపాధ్యాయులు కొలువు తీరనుండడంతో పాఠశాలలకు కొత్త కళ రానుంది.

- జిల్లాలో చాలా పాఠశాలలు సింగిల్ టీచర్లతోనే నడుస్తున్నాయి. వాస్తవానికి 1:20 నిష్పత్తిలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉండాలి. కానీ, కొన్ని చోట్ల 20 మంది విద్యార్థులు దాటినా ఏకోపాధ్యాయులతోనే నిర్వహిస్తున్నారు. మెగా డీఎస్సీ ద్వారా కొత్త ఉపాధ్యాయులు వస్తే విద్యార్థుల నిష్పత్తికి అనుగుణంగా ఏకోపాధ్యాయ పాఠశాలల్లో పోస్టులను భర్తీ చేసే అవకాశం ఉందని ఉపాధ్యాయ వర్గాలు భావిస్తున్నాయి.

విద్యా ప్రమాణాలు మెరుగు..

విద్యా ప్రమాణాల మెరుగుకు ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటుంది. ఇప్పటికే పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి సన్న బియ్యం సరఫరా చేస్తుండడంతో విద్యార్థులు కడుపునిండా తింటున్నారు. గత నెల 10న మెగా పీటీఎం (పేరెంట్ టీచర్ మీటింగ్)ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించి రికార్డు సృష్టించింది. ఈ నెల 11 నుంచి ఫార్మేటివ్ ఎసెస్‌మెంటు పరీక్షలను నిర్వహించనుంది. గతంలో మాదిరిగా కాకుండా ఈసారి ప్రత్యేకంగా ఫార్మేటివ్ బుక్‌లెట్‌లను ముద్రించింది. అలాగే ఈ ఏడాది ఉపాధ్యాయులకు హేండ్ బుక్‌లను కూడా అందజేసింది.

మాజీ మంత్రి అప్పలరాజుపై చర్యలు తీసుకోండి



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

వజ్రపుకొత్తూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే గౌతు శిరీషను కించపరిచేలా మాట్లాడిన మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 5న విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే గౌతు శిరీషపై అభ్యంతర వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. ఒక మహిళా అని చూడకుండా సమాజంలో గౌరవం కలిగిన శాసనసభ్యురాలిపై ఇంతటి ఘోరమైన పదాలు వాడి మనోవేధనకు గురిచేశారన్నారు. అప్పలరాజుపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. అగ్నికులక్షత్రియ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, మాజీ ఎంపీపీ వసంతరావు, పీఏసీఎస్ చైర్మన్ కణితి సురేష్, కొల్లి రమేష్, పోతనపల్లి సాంబమూర్తి, సూరాడ మోహనరావు ఉన్నారు.

చేనేత కార్మికుల హర్షం

పాతపట్నం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): చేనేతకు చేయూత అందిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించడంపై నేతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ఆలిండియా హేండ్‌లూమ్ అడ్వైసరీ కమిటీ మాజీ సభ్యుడు మంచు కృష్ణారావు ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం కొరసవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేశారు. టీడీపీ నాయకులు మద్దు రామారావు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

సూక్ష్మ ప్రణాళికతో డ్వాక్రా సంఘాలకు రుణాలు



మాట్లాడుతున్న లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరావు

నరసన్నపేట, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): డిజిటల్ సూక్ష్మ ప్రణాళికల ద్వారా డ్వాక్రా సంఘాలకు రుణాలు మంజూరు చేయాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ పేడాడ శ్రీనివాసరావు సూచించారు. బుధవారం స్థానిక మహిళ సాధికారిత భవనంలో బ్యాంకర్లు, అధికారులతో సమావేశం నిర్వహించారు. కౌలురైతులకు విరివిగా రుణాలు ఇవ్వాలని, ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం అమలకు బ్యాంకులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాబార్డు జిల్లా మేనేజర్ రమేష్‌కుమార్, బ్యాంక్ లింకింగ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ నాగమణి, యూనియన్ బ్యాంకు కన్వీనర్ శ్రీనివాసరెడ్డి ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

తవ్వకాలు ఆపకపోతే ఎన్‌జీటీకి ఫిర్యాదు చేస్తా

హిరమండలం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): గొట్టాబ్యారేజీ దిగువన మహాలక్ష్మిపురం గ్రామం వద్ద వంశధార నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు అపకపోతే నేషనల్ గ్రీన్ కోర్ ట్రిబ్యునల్(ఎన్‌జీటీ)కి ఫిర్యాదు చేస్తానని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో వంశధార నదిలో ఇసుక అక్రమ క్వారీ నిర్వహణపై 'కప్పెయ్.. దోచేయ్' శీర్షికతో ప్రచురితమైన కథనంపై ఆమె స్పందించి బుధవారం పరిశీలించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. నిబంధనలు విరుద్ధంగా ఇక్కడ ఇసుక క్వారీ ఎలా మంజూరు చేశారని ప్రశ్నించారు. వైసీపీ నాయకులు పాల్గొన్నారు

కాలువ పనులు చేయాలి

టెక్కలి రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): అక్కవరం నుంచి మేఘవరం వరకు వంశధార 46ఎల్ఆర్ కాలవ పనులు చేయాలని పలువురు రైతులు కోరారు. ఈ మేరకు బుధవారం టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తికి రైతులు వినతి పత్రం అందజేశారు. వెసవిలో బీఎస్ఎండ్‌జేఆర్ కళాశాల నుంచి తిర్లంగి వరకు పనులు చేసి రైల్వేట్రాక్ నుంచి మేఘవరం వరకు పనులు చేయకపోవడంతో నీరు రావడం లేదన్నారు.

ప్రశ్నిస్తే చితకబాదుతారా?

- అన్యాయంగా కేసులు పెట్టించారు
- పోలీసుస్టేషన్ ఎదుట ప్రజల నిరసన
- తాము ఎవరినీ కొట్టలేదన్న ఎస్ఐ



గాయపడిన వెంకటరమణ

శ్రీకాకుళం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): కొత్తూరు పోలీసుస్టేషన్ ఎదుట శోభనాపురం తదితర గ్రామాల ప్రజలు బుధవారం నిరసన తెలిపారు. శోభనాపురం గ్రామానికి చెందిన గెల్లంకి వెంటరమణను కొత్తూరు ఎస్ఐ ఎండీ అమీర్ అలీ చితకబాదారని, తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. శోభనాపురం క్వారీ వద్ద భారీగా బ్లాస్టింగ్ చేస్తుండడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందని, దీంతో బ్లాస్టింగ్ నిలుపుదల చేయాలని అడ్డుకున్నందుకు కొంతమంది నాయకుల ప్రోద్బలంతో పోలీసులు కొట్టారని గెల్లంకి వెంటరమణ ఆరోపించారు. న్యాయం కోసం పోలీసు స్టేషన్‌కు వెళితే తనపై దాష్టికంగా దాడి చేశారన్నారు. వెంకటరమణ ప్రజలతో కలిసి బుధవారం పోలీసుస్టేషన్‌కు వెళ్లి నిలదీయగా.. పోలీసులు, ప్రజల మధ్య చిన్నపాటి తోపులాట జరిగినట్లు తెలిసింది. అనంతరం పోలీసులు తనను కొట్టడంతో గాయాలపాలై కొత్తూరు ఆసుపత్రిలో చేరానని, కొత్తూరు వైద్యులు మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం ఆసుపత్రికి తరలించారని వెంకటరమణ తెలిపారు. అయితే తమను ఇబ్బందులు పెడుతున్నారంటూ వెంకటరమణపై క్వారీ నిర్వాహకులు మూడు రోజులు క్రితం పోలీసులకు ఫిర్యాదు చేశారని, దీంతో ఆదివారం వెంకటరమణపై కేసు నమోదు చేసి 41 నోటీసు ఇచ్చి బెయిల్‌పై విడుదల చేశామని కొత్తూరు ఎస్ఐ ఎండీ అమీర్ అలీ తెలిపారు. వెంకటరమణను కొట్టారని చేస్తున్న ఆరోపణలో వాస్తవం లేదన్నారు. తనపై నమోదు చేసిన కేసును కప్పి పుచ్చుకోవడానికి కొంతమందిని తీసుకువచ్చి హంగామా చేశారన్నారు.

విద్యార్థినుల ఆరోగ్యంపై అవగాహన సదస్సు



ఆరోగ్యంపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

టెక్కలి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం జరిగిన బాలికల ఆరోగ్యం-సామరస్యం అనే అంశంపై కిమ్స్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ఎస్.సుకన్య, డాక్టర్ జి.చైతన్యకిరణ్ పాల్గొని మహిళల్లో వచ్చే గర్భ, శ్వాసకోశ వ్యాధులపై అవగాహన కలిపంచారు. కళాశాల ఉమెన్ డెవలప్మెంట్ సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కేవీ లలితాభవానీ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఏఎస్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కిమ్స్ ఆసుపత్రి సహకారంతో కళాశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు సత్విక్, క్యాంప్ కో-ఆర్డినేటర్లు గోపి, రాజశేఖర్, ఎన్ఎస్ఎస్ పీవో మారుతీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల పీజీ కోట తగ్గించడం అన్యాయం

మెళియాపుట్టి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ఇన్‌సర్వీస్ వైద్యులకు ఉన్నా పీజీ కోటను 20 శాతం నుంచి 15 శాతానికి తగ్గించడం అన్యాయని ఏపీ ప్రాథమిక వైద్యుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వినోద్, రాహుల్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కోటాను పెంచాలని లేకుంటే ఆందోళన చేస్తామన్నారు.

గిరిజన భవనం ఏర్పాటు చేయాలి

మెళియాపుట్టి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గిరిజన భవనం ఏర్పాటు చేయాలని పలువురు గిరిజనులు ఎమ్మెల్యే మామిడి గోవిందరావును కోరారు. ఐటీడీఏ ఏర్పాటు చేస్తున్నట్టు ఇటీవల ప్రభుత్వం ప్రకటించిందని, కొండల పైనుంచి వస్తున్న గిరిజనులు విశ్రాంతి తీసుకోవడానికి అవసరమైన భవనం లేదన్నారు. అందువల్ల ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు చేయించాలని కోరారు.